నరసింహం చేతిలో ఓ పాకెట్ తీసుకుని మురళి గదిలోకొచ్చాడు.

మురళి ఫ్యాక్టరీకెళ్లడానికి రెడీ అవుతున్నాడప్పుడే.

"మురళీ ఇదిగో -- ఇవాళ్టి నుంచీ ఈ పులిగోరు మెడలో వేసుకో--" అంటూ పాకెట్ విప్పి ఓ పులిగోరు అతనికిచ్చాడు.

"పులిగోరెందుకు మావయ్యా--"

"ఆ డూప్లికేట్ గాడిని పట్టుకోవడానికి అనుమానం వచ్చినప్పుడు సోదాచేస్తే పులిగోరు వున్నదీ లేనిదీ తెలిసిపోతుంది. అప్పుడు వాడెలా తప్పించుకుంటాడో చూద్దాం!"

"మంచి ప్లాన్ మావయ్యా!" ఉత్సాహంగా అన్నాడు మురళి.

"ఈ దెబ్బతో వాడి ఆటకట్టు-- "

"నీ మెడలో పులిగోరు వేసుకున్న విషయం అమ్మాయికి కూడా తెలియనీయవద్దు!"

"సరే! " అంటూ దాన్ని మెళ్ళో వేసుకున్నాడు.

ఎందుకో నరసింహానికి అనుమానం వచ్చి "ఏదీ నీ తల చూపించు" అన్నాడు.

మురళి ఆశ్చర్యంగా "ఎందుకు?" అన్నాడు.

ఎందుకో చెప్పకుండా "కావాలి, పనుంది" అంటూ తలవంచి చూశాడు.

తలమీద గాయం వుంది, హరికృష్ణ బాత్‌రూంలో పడేసే ముందు కొట్టింది. మురళి ఫ్యాక్టరీకి వెళ్ళిపోయాక మేడమీద కూర్చుని బైనాక్యులర్స్‌తో గేటువేపే చూడసాగాడు. ఆ డూప్లికేట్ ఏ క్షణంలో నయినా మళ్లీ ఏదో ఒక ట్రిక్ చేస్తాడు.

ఈసారి ఎలాగయినా వాడిని పట్టుకునేది ఖాయం. ఎందుకంటే ఈ పులిగోరు సంగతి వాడికి తెలీదు. కేవలం తనకూ మురళికి మాత్రమే తెలుసు. అదీగాక తను ఇంకో అద్భుతమయిన ఉపాయం కూడా పన్నాడు.

ఈ విషయం మురళీకి కూడా తెలీదు. అదేమిటంటే.....

ఆ పులిగోరు లోపల తను సంతకం చేసిన ఓ చిన్న కాగితం వుంచాడు.

ఒకవేళ ఆ హరికృష్ణగాడు ఓ పులిగోరు తగిలించుకొచ్చినా లోపల తను సంతకం చేసిన కాగితం విషయం మాత్రం తెలీదు. అక్కడ దొరికిపోక తప్పదు.

మరో గంటసేపు గడిచింది. గేటు బయట టాక్సీ ఆగటం చూసేసరికి నరసింహం నిటారుగా లేచి నిలబడ్డాడు.

తను ఎదురుచూస్తున్న అవకాశం వచ్చింది. వీడు మురళీయో, హరికృష్ణో ఇప్పుడే తేల్చుకోవాలి! అదీ వాడికేమీ అనుమానం రాకుండా.

కొద్దిసేపు యధావిధిగా ఘూర్ఖావాడితో వాదన జరిగాక చివరకు ఘూర్ఖా అతనిని లోపలకు వదిలాడు.

నరసింహం మేడదిగి మురళికి ఎదురు వెళ్లాడు. నరసింహం మురళీని పరీక్షగా చూశాడు.

అదే చారల షర్టు -- అదే బూటు ప్యాంట్ -- మురళి ఉదయం వేసుకెళ్ళిన డ్రస్ అదే [illegible]

పరీక్షలో వాడే నెగ్గినట్లు లెఖ్క. కాళ్ళకున్న బూట్లవంక చూశాడు నరసింహం.

నార్త్‌స్టార్ బూట్లు కొత్తవి. అంతకు ముందురోజే కొన్నట్లు తెలిసిపోతోంది. మురళి వాటిని నిన్నే కొన్నాడు. ఈ టెస్ట్‌లోనూ వాడు మురళీయేనని ధృవపడింది. అలాగే జేబులోని పెన్‌వంక చూశాడు నరసింహం! గోల్డ్ కాప్ పెన్ కనబడుతూనే వుంది. ఇక్కడా అనుమానం లేదు.

అయినా తను వీటితో సంతృప్తి పడదల్చుకోలేదు. పులి గోరు చూడాలి. ఒకవేళ వీడు హరికృష్ణ అయితే ఆ గొలుసు ఆఫీసులో జారిపోయిందని చెపుతాడేమో!

అసలీ గొలుసు విషయం వీడికి తెలుసా లేదా అన్నది జాగ్రత్తగా మాటల్లో బయటికి లాగాలి. దానికి ముందు వీడికి తెలియకుండా వీడి మెడలో గొలుసు వుందా లేదా అన్నది తెలుసుకోవాలి.

ఈ లోపులో మురళి, నరసింహాన్ని చూస్తూ "మద్రాస్‌నుంచి ఫోన్ వచ్చింది! స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ వాళ్ళు అర్జంటుగా రమ్మంటున్నారు. షిప్‌లో ఆయిల్ వచ్చిందట!" అన్నాడు .

"ఎవర్ని పంపిస్తున్నావ్?" అడిగాడు నరసింహం.

"ఈసారి నేనే వెళ్దామనుకుంటున్నాను. ఆ ఎస్.టి.సి వాళ్ళు ఎప్పుడూ ఏదో ఒక కాంప్లికేషన్స్ తెస్తున్నారు. నేను వెళ్లి లంచాలు వగైరాలేమయినా వుంటే ఎడ్జస్ట్ చేసి వస్తాను. ఆ తరువాత అంతా గమ్మత్తుగా జరిగిపోతుంది...."

నరసింహానికి లోలోపల ఆనందం కలిగింది. మురళి తన బిజినెస్‌లో ప్రవేశించిన తర్వాత ఫలితాలు చాలా అద్భుతంగా కనబడుతున్నాయ్. లాభాలు విపరీతంగా పెరుగుతున్నాయ్. వాడంత తెలివితేటలు గలవాడవుతాడని ఎప్పుడూ అనుకోలేదు.

"ఎప్పుడు వెళ్తున్నావ్?" అడిగాడు నరసింహం.

"ఫ్లైట్‌కి ఇంకా రెండు గంటల టైముంది! అన్నట్లు మీరు ఈ రెండు రోజులూ చాలా జాగ్రత్తగా వుండాలి. వాడు నేను ఊళ్ళో లేనన్న విషయం తెలుసుకుని ఇంటికి వచ్చే అవకాశం వుంది. రేపు సాయంత్రం లోపల నాలాగా ఎవరొచ్చినా జాగ్రత్తగా చెక్ చేయండి! వాడి మెడలో పులిగోరు వుంటేనే లోపలకు రానీయండి. అదే గుర్తు మనకు---"

"ఈ సారి వాడు వస్తే మాత్రం వాడికది అంతమే! అలాంటి ఏర్పాట్లు చేశాను."

రాధ హాల్లోకొచ్చి వాళ్ళిద్దరినీ చూసి ఆశ్చర్యపోయింది.

"అదేమిటి అప్పుడే వచ్చేశారేం?" అడిగిందామె.

మురళి కోపంతో మండిపడ్డాడు "రాధా! నీకెన్నిసార్లు చెప్పాను, నన్ను చూడగానే--ఇది నేనే అయినట్లు నమ్మవద్దని! ముందు ఇది నేనా లేక ఆ హరికృష్ణా తేల్చుకున్నాక గానీ దగ్గరకు రావొద్దని చెప్పానా?"

రాధ నాలిక్కరచుకుంది "సారీ! మర్చిపోయానండీ! ఏదీ, మీ కర్చీఫ్ చూపించండి--" మురళి జేబులోనుంచి కర్చీఫ్ తీసి ఆమెకిచ్చాడు. దానిమీద 'LOVE' అన్న అక్షరాలు కొట్టొచ్చినట్లు కనిపించినయ్.

“హమ్మయ్య -- మీరేనన్న మాట. బ్రతికించారు” అందామె.

“ఆ కర్చీఫ్ గొడవేమిటి?” అడిగాడు నరసింహం అయోమయంగా.

“మనింటికి వచ్చింది నేనయింది, ఆ హరికృష్ణగాడయిందీ నిర్ధారించుకోడానికి రాధకో అయిడియా ఇచ్చా! నేను ఇంటికి రాగానే ఆమె నా జేబులోనుంచి కర్చీఫ్ లాక్కుని పరీక్షిస్తుంది. దాని మీద LOVE అన్న అక్షరాలుంటేనే అది నేనయినట్లు. లేకపోతే వెంబడే పోలీస్‌కి ఫోన్ చేసి పట్టించేయాలి!”

నరసింహానికి సంతృప్తి కలిగింది.

“ఇన్ని కట్టుదిట్టాలు చేశాక ఇంక వాడెలా తప్పించుకుపోతాడో చూద్దాం!” అన్నాడు ఆనందంగా.

“మీరు ఫాక్టరీకి వెళ్లలేదా?” అడిగింది రాధ మురళిని.

“వెళ్ళాను కానీ అర్జంటుగా మద్రాస్ వెళ్ళాల్సి వచ్చింది. త్వరగా నా బట్టలూ అవీ సూట్‌కేస్‌లో సర్దు.”

“మద్రాసెందుకండీ ఇంత అర్జంట్‌గా?”

“ఫాక్టరీ పని మీద -- ఇంకో రెండు గంటల్లో ఫ్లైట్ వుంది”

రాధ గదిలోకి నడిచింది. ఆమె వెనుకే తనూ నడిచాడు మురళి.

త్వరత్వరగా అతని బట్టలు సర్దసాగిందామె.

నరసింహం చాలా పట్టుదలతో వున్నాడు. వాడు మురళి అని ఎంత నమ్మకం కలిగినా సరే -- మెడలో పులిగోరు వుందో లేదో ఖచ్చితంగా తేల్చుకోవాలని నిర్ణయించుకుని ఓరకంట మురళివేపే చూస్తున్నాడు. మరి కాసేపటి తర్వాత వాళ్ళ పడగ్గదిలోనుంచి కిలకిలమంటూ రాధ నవ్వులు వినిపించినయ్. దానితో శృతి కలుపుతూ మురళి నవ్వు.

నరసింహం నెమ్మదిగా లేచి పడగ్గది దగ్గరకెళ్ళాడు. లోపల్నుంచీ మాటలు అస్పష్టంగా వినబడుతున్నాయ్.

“అబ్బ! ఏమిటిది -- మరీ చిన్న పిల్లాడిలా.”

“మళ్ళీ రేపు రాత్రివరకూ నీ దర్శనం అవదుకదా మరి---”

“ఒక్కరోజు కనిపించకపోతే వుండలేరా?”

“ఉండలేను”

“దీసీజ్ టూ మచ్”

“అయినా సరే”

“అబ్బ -- వదలండి-అవతల నాన్నగారున్నారు.”

“ఉంటే ఏం?”

“ఏమనుకుంటారు? పట్టపగలే ఇలా బరితెగించారని...”

“[illegible]”

"అయ్యో-- వదలండీ! ప్లీజ్---"

"ష్-మాట్లాడకు"

నరసింహం నెమ్మదిగా ఓ కుర్చీ తెచ్చి కిటికీ దగ్గర శబ్దం కాకుండా వేశాడు. తను దాని మీదెక్కి నెమ్మదిగా వెంటిలేటర్‌లో నుంచి తొంగిచూశాడు.

చూడకూడని దృశ్యమే అయినా తన కోసం, తన అల్లుడు, కూతురి కోసం తప్పటంలేదు. రాధ మురళి మెడచుట్టూ చేతులు వేసి, నాలుకతో అతడి పెదవుల్ని సుతారంగా స్పృశిస్తూంది.

మంచం పక్కనే వున్న డ్రెస్సింగ్ టేబిల్‌మీద మురళి మెడలోని పులిగోరు మెరుస్తూ కనిపించింది.

నరసింహానికి నమ్మకం కలిగింది.

ఇంక సందేహం లేదు. వీడు తన మురళీయే. పులిగోరే అందుకు సాక్ష్యం. కుర్చీ దిగి వెళ్ళి సోఫాలో కూర్చుండిపోయాడు అతను.

మరి కాసేపటి తర్వాత రాధ పడగ్గదిలో నుంచి చెదిరిన బట్టలతో, రేగిన జుట్టు సరిజేసుకుంటూ బయటకు రావటం ఓరకంట గమనించాడతను.

ఆ తరువాత కాసేపటికి మురళి డ్రస్ చేసుకుని వచ్చాడు.

"ఇక వెళ్తాను ! టైమయింది ఫ్లైట్‌కి"

"కారు తీసుకెళ్ళు ఎయిర్‌పోర్ట్‌కి"

"వద్దులే-- టాక్సీలో వెళ్తాను"

నౌఖరు సూట్‌కేస్ తీసుకెళ్ళి టాక్సీలో వుంచాడు.

రాధ అతనితోపాటు గేటువరకూ నడచింది "రేపు రాత్రికల్లా తప్పక వచ్చేస్తారు కదూ?"

"ఓ--యస్"

"మద్రాస్ వెళ్లగానే ఫోన్ చేస్తారు కదూ?"

"వెంటనే"

అతను టాక్సీలో కూర్చున్నాడు.

"మావయ్యా! ఇవాళ రేపూ జాగ్రత్తగా వుండండి. నేను మద్రాసు వెళ్ళిన విషయం తెలిసి వాడు ఇంటికి రావడానికి ప్రయత్నించవచ్చు"

"రావటమే మంచిదిరా! వాడి చరిత్ర ముగిసిపోతుంది."

"అవునవును"

టాక్సీ వెళ్ళిపోయింది.

సాయంత్రం నాలుగయేసరికి గేటుదగ్గర గొడవ వినిపించింది. నరసింహం పిస్టల్ జేబులో వేసుకుని బాల్కనీలోకెళ్ళి చూశాడు.

మురళీ ఘూర్ఖాతో వాదిస్తున్నాడు .

నరసింహం ఆనందంగా చూశాడా దృశ్యం. వాడే హరికృష్ణ!

ఎలాంటి సందేహం లేదు. మురళీ మద్రాస్ వెళ్ళిన విషయం తెలిసి సాలెగూటికొచ్చాడు. ఈ రోజుతో వాడి నాటకానికి అర్జంటుగా తెర పడిపోతుంది.

మెట్లు త్వరత్వరగా దిగి కిందకు వెళ్ళాడతను. నరసింహాన్ని కోపంగా చూశాడు మురళి.

"ఈ ఘూర్ఖాని తీసి పారెయ్‌మని చెప్తే వినవేం? నేనెప్పుడు ఇంటికొచ్చినా పేచీగానే వుంది వీడితో--"

ఘూర్ఖా నరసింహం రావటం చూసి మురళికి దారి ఇచ్చాడు.

మురళి లోపలికొచ్చి హాల్లోనే కూలబడ్డాడు.

"రాధా! టీ తీసుకురా! అర్జంట్!" అన్నాడతను.

రాధ బయటికొచ్చి అతనిని చూసి నివ్వెరపోయింది.

"అదేమిటి, మీరు మద్రాస్ వెళ్లలేదా!" అంది ఆశ్చర్యంగా.

ఆ మాటలు మురళికి చిరాకు కలిగించినయ్.

"నేను మద్రాస్ వెళ్లటం ఏమిటి?"

"మీరు మద్రాస్ వెళ్తానన్నారుగా ఇందాక?"

"నేనన్నానా?"

"అవునండీ ! అలా మాట్లాడతారేమిటి? ఇంతకు ముందేగా సూట్‌కేస్ తీసుకెళ్ళిందీ?"

మురళి ఆశ్చర్యంగా నరసింహం వేపు చూస్తూ లేచినుంచున్నాడు.

"కొంపదీసి వాడు మళ్ళీ రాలేదు కదా?"

నరసింహం నవ్వాడు "ఒరే హరికృష్ణా! ఇంతకాలం జాగ్రత్తగా మానేజ్ చేశావ్. ఇప్పుడు మాత్రం పప్పులో కాలేశావ్. మా మురళి ఇందాకే మద్రాస్ వెళ్ళాడు. ఆ విషయం పాపం నీకు తెలిస్చావలేదు. లే-- నీ ఆఖరిక్షణాలు దగ్గర పడ్డాయ్" అన్నాడు నరసింహం.

"ఏమిటి నువ్ మాట్లాడేది? నేను మురళిని మావయ్యా! వాడు మళ్లీ మిమ్మల్ని మోసం చేశాడు."

"నీ ఆటలు ఇంక సాగవని ఓసారి చెప్పాను కదా! ఒరే రంగా--" అంటూ అరిచాడు నరసింహం.

లోపలి గదిలో దాగున్న రంగా పరుగుతో వచ్చి మురళిని రెక్కలు విరిచి పట్టుకున్నాడు.

"మావయ్యా! ఏమిటి ఇది? నేనే మురళినని చెప్తుంటే వినవేం?" కోపంగా అరిచాడు మురళి.

"ఒరే హరికృష్ణా! ఇంక నీ నాటకానికి తెర పడిందన్నానుకదా! అంచేత నటించటం ఆపెయ్! నన్ను ఇంతవరకూ ఎవరూ ఫూల్ చేయలేదు. చేసిన వాడెవడూ తప్పించుకోనూ లేదు. లేకపోతే నీ భరతం పడతానికి కొంచెం టైమ్ ఎక్కువ పట్టింది..."

"నీకు పిచ్చెక్కింది! నేను మురళినేనని చెప్తున్నా వినిపించుకోవేం? కావాలంటే మనిద్దరికీ

నరసింహానికి చూపించాడతను.

నరసింహం మళ్ళీ నవ్వాడు.

"ఒరేయ్- నువ్ చాలా తెలివిగలవాడివని నేను వప్పుకుంటున్నాకదా! అంచేత ఇంక నీ తెలివితేటల ప్రదర్శన ఆపెయ్-- " అంటూ రంగాతో "ఒరే రంగా! ఇంకా చూస్తావేమిట్రా... వీడి కివ్వాల్సిన గౌరవమర్యాద లిచ్చేయ్!"

రంగా పాంట్ జేబులోనుంచి కత్తి తీశాడు.

"నేను ఆ రోజు పొరబాటున వదిలి తప్పుచేశాన్రా! ఇప్పుడు తప్పుని సరిజేసుకుంటాను-- నువ్వు నా దగ్గర ఏ మాత్రం తెలివితేటలు చూపించకు" అంటూ అతని గుండెలమీద కత్తిమొన ఉంచాడు.